క్లుప్తంగా

పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అయేషాఖాన్

ఉండ్రాజవరం: గర్భిణులు తగిన ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యురాలు ఆర్.ఉషాదేవి అన్నారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజనలో భాగంగా బుధవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. తణుకులోని నిస్సా హాస్పిటల్ ప్రసూతి వైద్యురాలు అయేషా ఖాన్ గర్భిణులకు పరీక్షలు చేసి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఉషాదేవి మాట్లాడుతూ పీహెచ్‌సీలో ప్రసవించిన తల్లుల ఖాతాలకు పోషకాహారం నిమిత్తం జననీ సురక్ష యోజన కింద రూ.1,000 జమ చేయబడతాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎం.సుబ్రహ్మణ్యం, పబ్లిక్ హెల్త్ నర్స్ కె.కుమారి, పర్యవేక్షకులు జిన్నూరి శ్రీనివాసు, కె.నాగమణి, నర్సులు కుమారి, ఝాన్సీ, సంధ్య, మహిళ ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సైగా పరమహంసకు పదోన్నతి

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం ఏఎస్సైగా పని చేస్తున్న పరమహంసకు ఎస్సైగా పదోన్నతి లభించింది. రైల్వేలో సుదీర్ఘ కాలం విధులు నిర్వహించిన పరమహంస పదోన్నతి పొంది సమిశ్రగూడెం ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన ఇకపై కాకినాడ జిల్లాల్లో ఎస్సైగా పని చేయనున్నారు. పరమహంసను ఎస్సై రమేష్, స్టేషన్ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

నేటి నుంచి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

నల్లజర్ల: కోవిడ్ సమయంలో నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిలిపివేశారు. దాంతో ఆపరేషన్ చేయించుకునే మహిళలు వ్యయ ప్రయాసలకు ఓర్చి గోపాలపురం, కొవ్వూరు, తాడేపల్లిగూడెం వెళ్లాల్సి వస్తోంది. బాలింతలకు ఇది ఎంతో ప్రయాస. వారి ఇబ్బందులను తొలగించేందుకు ఇక్కడి వైద్య ఉద్యోగులు పలు దఫాలుగా ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు వారి ప్రయత్నాలు ఫలించాయి. గతంలో ఇక్కడ పని చేసిన డాక్టరు బాలు ప్రకాశం (డాక్టరు బాలు) నెలకొకసారి నల్లజర్ల పీహెచ్‌సీకి వచ్చి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడానికి అంగీకరించారు. ఈ కార్యక్రమం ప్రపంచ జనాభా దినోత్సవం నాడైన గురువారం నుంచి ప్రారంభం కానున్నది.

వెంకట్రామన్న మృతికి పలువురి సంతాపం

ఉండ్రాజవరం: మండలంలో దమ్మెన్ను మనసబుగా పని చేసిన మట్టపర్తి వెంకట్రామన్న (80) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వెంకట్రామన్న బెంగళూరులోని కుమారుడు రామకృష్ణ ఇంటి వద్ద ఉంటున్నారు. ఆయనకు భార్య అనసూయ, కుమారుడు రామకృష్ణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మనసబు మృతికి బుధవారం మండలంలోని పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

మాజీ సర్పంచ్ బ్రహ్మానందం మృతి



నిడదవోలు రూరల్: మండలంలోని కాటకోటేశ్వరం పంచాయతీ మాజీ సర్పంచ్ బంగారు బ్రహ్మానందం (68) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. బ్రహ్మానందం పీఎంపీగా ప్రాక్టీసు చేసేవారు. సర్పంచ్‌గా బ్రహ్మానందం గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. బ్రహ్మానందం మృతికి గ్రామ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

కొవ్వాడ కాలువలో పూడిక తీయించాలి

కొవ్వూరు: కొవ్వాడ కాలువలో గుర్రపు డొక్క తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు, రైతులు బుధవారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఏటా వర్షాకాలంలో గుర్రపు డెక్క కారణంగా పంటలు మునిగిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ దాటే అవకాశం లేకపోవడంతో తాము పలుచోట్ల ఇబ్బందులను పడుతున్నారన్నారు. అధికారులతో అంచనాలు తయారు చేయించి ఈ సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే ముప్పిడి హామీ ఇచ్చినట్టు బీజేపీ నాయకులు ప్రకటించారు. బీజేపీ రాష్ట్ర కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, పిల్లలమర్రి మురళీకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, మడిచర్ల రామచంద్రరావు, రైతులు తిరుమలశెట్టి కృష్ణ, నామా రంగనాయకులు, కొండేపాటి సత్యనారాయణ తదితరులు ఎమ్మెల్యేను కలిశారు.

టీడీపీ దాడులను ఐక్యంగా ఎదుర్కొందాం

- అండగా మీ వెన్నంటే నేనుంటా
- రాష్ట్ర హోం శాఖ మాజీ మంత్రి తానేటి వనిత
- వైఎస్సార్ సీపీ మండల శాఖ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తానేటి వనిత

దేవరపల్లి: తెలుగుదేశం నాయకులు కొనసాగిస్తున్న దాడులను వైఎస్సార్ సీపీ శ్రేణులంతా సంఘటితంగా ఎదుర్కోవాలని రాష్ట్ర హోం శాఖ మాజీ మంత్రి, పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత పిలుపు నిచ్చారు. అండగా తాను అందుబాటులో ఉంటానని ఆమె భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ దేవరపల్లి మండల శాఖ సమావేశం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం జరిగింది. ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి తానేటి వనిత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీని లేకుండా చేయాలనేది టీడీపీ కూటమి అజెండా అని ఆమె ఆరోపించారు. వైఎస్సార్ సీపీ నాయకుల ఇళ్లపై టీడీపీ మూకలు దాడులు చేసి, తిరిగి వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఓటమికి చాలా కారణాలు చాల ఉన్నాయని, అన్ని స్థాయిల్లోనూ తప్పిదాలు జరిగాయన్నారు. వాటిని సరిదిద్దుకుని ముందుకు వెళదామని, 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సంఘటితంగా పని చేయాలని ఆమె సూచించారు. పదవులు, ఆస్తులు కాపాడుకోవాలనుకునే వారు వైఎస్సార్ సీపీని వీడి వెళ్లవచ్చని వనిత అన్నారు. సమావేశంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, నరహరిశెట్టి రాజేంద్రబాబు, మేడిబోయిన గంగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి సూర్యనారాయణ, దుగ్గిన గంగాధర్, సర్పంచ్ కడిమి వీరకుమారి, కె.హైమావతి, ఆనిశెట్టి సూర్యచంద్రం, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ యాదవోలు గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నాగశ్రీను



వైఎస్సార్ సీపీ యాదవోలు గ్రామ కమిటీని ప్రకటిస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత

వైఎస్సార్ సీపీ యాదవోలు గ్రామ కమిటీని పార్టీ శ్రేణులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. ఈ మేరకు బుధవారం దేవరపల్లిలో జరిగిన ఆ పార్టీ దేవరపల్లి మండల సమావేశంలో రాష్ట్ర హోం శాఖ మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత ప్రకటించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎలికే నాగశ్రీను, ఉపాధ్యక్షుడిగా చమటపల్లి రమేష్, కార్యదర్శిగా ఎస్‌కే జాకీర్, సహాయ కార్యదర్శిగా కాసబత్తుల రాజు, కోశాధికారిగా కుప్పాల అయ్యప్ప ఎన్నికైనట్టు ఆమె తెలిపారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేసి, జగనన్నకు అండగా నిలవాలని ఆమె కమిటీ సభ్యులను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, నరహరిశెట్టి రాజేంద్రబాబు, గన్నమని జనార్దన రావు, కూచిపూడి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఎలికే నాగశ్రీను, గ్రామ కమిటీ అధ్యక్షుడు, యాదవోలు

రెండో దశ వ్యవసాయ గణనపై శిక్షణ



రెండో దశ వ్యవసాయ గణనపై సమావేశం

తాళ్లపూడి: ఎంపిక చేసిన గ్రామాల్లో రెండో దశ వ్యవసాయ గణన చేపట్టాలని కొవ్వూరు ఆర్డీవో కార్యాలయ ఉప గణాంక అధికారి సోమరాజు వీఆర్వోలకు సూచించారు. మండలంలో రెండో దశ వ్యవసాయ గణనపై బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సోమరాజు వారికి శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు తమ ఆండ్రాయిడ్ మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసే యాప్‌లో మండలంలోని రైతుల, పంటల సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలన్నారు. ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వీఆర్వోలకు కావాల్సిన మొత్తం సమాచారం అందిస్తామన్నారు. 2021–22 సంవత్సరం ప్రాతిపదికగా ఆగస్టు 31లోగా వ్యవసాయ గణనను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ సీతారామరాజు, వీఆర్వోలు సంజీవరావు, ప్రవీణ్, నరేష్ శంకరరావు, లీలావతి, సుజాత, నాగేశ్వరరావు, విజయ పాల్గొన్నారు.

పొగాకు సాగు నియంత్రణ పాటించాలి

- ఎంపీ పురందేశ్వరి సూచన
- ఉత్తమ పొగాకు రైతులు, శాస్త్రవేత్తలకు బహుమతుల ప్రదానం

దేవరపల్లి: రైతులు నియంత్రణ పాటించి నాణ్యమైన పొగాకు పండించాలని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సూచించారు. ఉత్తమ పొగాకు రైతులు, శాస్త్రవేత్తలకు అవార్డుల ప్రదానోత్సవ వేడుకను బుధవారం దేవరపల్లిలోని కరుటూరి ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. టుబాకో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (టీఐఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం, ఏలూరు ఎంపీలు పురందేశ్వరి, మహేష్‌కుమార్, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. తొలుత ఎంపీ పురందేశ్వరి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీఐఐ డైరెక్టర్ మిస్టర్ శరద్ టాండన్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఎంపీ పురంధేశ్వరి మాట్లాడుతూ రైతులు అదనంగా పండించిన పొగాకుపై బోర్డు వసూలు చేస్తున్న అపరాధ రుసుం రద్దుకు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ అంగీకరించారన్నారు. త్వరలో ఉత్తర్వులు వెడువడతాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో టీఐఐ డైరెక్టర్ మిస్టర్ శరద్ టాండన్, బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్ కుమార్, వైస్ చైర్మన్ జి. వాసుబాబు, పొగాకు బోర్డు కార్యదర్శి వేణుగోపాల్, సీటీఆర్ఐ డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, బోర్డు మాజీ వైస్ చైర్మన్ గద్దే శేషగిరి రావు పాల్గొన్నారు.



ఉత్తమ పొగాకు రైతులకు అవార్డులు అందజేస్తున్న ఎంపీలు పురందేశ్వరి, మహేష్ కుమార్‌లు

అవార్డు గ్రహీతలు వీరే

2022–23 సంవత్సరానికి ఉత్తమ రైతు అవార్డులకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి 13 మంది రైతులు ఎంపికయ్యారు. వారిలో ముగ్గురికి లైఫ్ టైమ్ అఛీవ్‌మెంట్ అవార్డులు, 10 మందికి ఉత్తమ అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. ఈ ఏడాది కొత్తగా ముగ్గురు శాస్త్రవేత్తలకు కూడా అవార్డులు అందజేశారు. సయ్యద్ బాజీ(కొయ్యలగూడెం), అరికట్ల గురుబ్రహ్మం (కనిగిరి), టి. వెంకటశేషమ్మ (ఒంగోలు), ఎస్‌హెచ్ అంబటి శ్రీనివాసరెడ్డి (ఒంగోలు), ఎస్‌హెచ్ జి. సంజీవరెడ్డి (ఒంగోలు), ఎస్‌హెచ్ కె వెంకటసత్యనారాయణ (జంగారెడ్డిగూడెం), ఎస్‌హెచ్ ఎస్ మాలకొండారెడ్డి (కందుకూరు) ఎస్‌హెచ్ కట్టా ఆంజిరెడ్డి (వెల్లంపల్లి), సుజాత (వెల్లంపల్లి), సత్తి జగదీశ్వరరెడ్డి(దేవరపల్లి), జీవీ రమాణారెడ్డి (కందుకూరు), గద్దే బీఆర్ ప్రసాద్(జంగారెడ్డిగూడెం), జి. నర్సప్పనాయుడు (డిచ్‌పల్లి), శాస్త్రవేత్తలు డాక్టర్ సుబ్బయ్య(సీటీఆర్ఐ), డాక్టర్ నంద, డాక్టర్ సాయి బిందు అవార్డులు అందుకున్నారు.

పెరవలిలో రీచ్ యువర్ పంచాయతీ

పెరవలి: ఖరీఫ్ వరి సాగులో రైతులు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటిస్తే పెట్టుబడి తగ్గడమే గాకుండా నాణ్యమైన, స్థిరమైన దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త చల్లా వెంకట నరసింహారావు సూచించారు. పెరవలి రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం రీచ్ యువర్ పంచాయతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు నారుమడి, ఎరువుల యాజమాన్య పద్ధతులు, విత్తనశుద్ధి గురించి రాజమహేంద్రవరం ఏరువాక శాస్త్రవేత్తల బృందం అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు పి.అమ్మాజీ, ఎస్. హేమజ్యోతి ఏవో మేరీ కిరణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, సారాలను అరికట్టండి

- అధికారులకు ఎంపీపీ పోశిరాజు ఆదేశం
- మత్తు పదార్థాల సరఫరా ఎక్కువైందంటూ సభ్యుల ధ్వజం
- తాళ్లపూడి మండల పరిషత్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు

తాళ్లపూడి: గంజాయి, సారా తయారీ, విక్రయాలను అరికట్టాలని మండల పరిషత్ అధ్యక్షుడు జొన్నకూటి పోసిరాజు అధికారులకు సూచించారు. తాళ్లపూడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పోశిరాజు అధ్యక్షతన బుధవారం తాళ్లపూడిలో జరిగింది. ఎంపీడీవో బి.వెంకటరమణ సమావేశాన్ని కొనసాగించారు. ఎంపీపీ పోశిరాజు వివిధ శాఖల పనితీరుపై అధికారులతో సమీక్ష జరిపారు. యువత పెడతోవ పట్టేలా కొందరు వ్యక్తులు గంజాయి, సారా, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలను విచ్చలవిడిగా గ్రామాల్లో విక్రయిస్తున్నారని పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. దీనిపై పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రావురుపాడు, వేగేశ్వరపురం, గజ్జరం ఎంపీటీసీ సభ్యులు హరిబాబు, వీరరాఘవమ్మ, గుంటు చిన్నబ్బాయి, గజ్జరం సర్పంచ్ గండి రాంబాబు ఆరోపించారు. దీనిపై ఎంపీడీవో వెంకటరమణ స్పందిస్తూ గంజాయి, సారా నివారణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌కో ఏఈ సీహెచ్ వెంకట్రావు మాట్లాడుతూ వర్షాకాలంలో పొలాల మీదుగా వెళ్లే వైర్లు తెగిపోయినా, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయినా వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. గ్రామాల్లో డయేరియా, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నామని తాళ్లపూడి పీహెచ్‌సీ డాక్టర్ హారికాగుప్తా పేర్కొన్నారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు పాటించాలని సంబంధిత అధికారులను ఆమె కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నూర్జహాన్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా, పరీక్షలు, పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా జరుగుతున్నాయన్నారు. అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ నూతన భవనాలకు నిధులు కేటాయించి నిర్మాణాలను పూర్తిచేయించాలని సీడీపీవో జి.మమ్మీ కోరారు. తమ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, చర్చి పక్కనే సారా అమ్మకాలు జరుపుతున్నా, సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని గజ్జరం సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు చిన్నబ్బాయి సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. చర్యలు తీసుకునేలా చూస్తామని ఎంపీపీ హామీ ఇచ్చారు. మండలంలో 1,000 కొబ్బరి మొక్కలు పంపిణీ చేశామని ఉపాధి ఏపీఎం రోజ్ మాణిక్యం తెలిపారు. ఎంపీపీ పోశిరాజు మాట్లాడుతూ తాళ్లపూడి మెయిన్‌రోడ్‌లో డ్రైనేజీ నిర్మాణానికి కార్యాచరణ చేపట్టాలని సూచించారు. కనీసం పాత డ్రైన్ వెలికి తీస్తే నిధులు మంజూరుకు కృషి చేస్తానని ప్రకటించారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, తహసీల్దార్ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ కోదాటి కనకయ్య, మండల సర్పంచుల చాంబర్ అధ్యక్షుడు కొమ్మిరెడ్డి పరశురామారావు, ఈవోపీఆర్డీ కేఎస్ వీరన్న, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీలు



మల్లవరంలో ప్లాస్టిక్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

చాగల్లు: నిషేధిత ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం అందరి బాధ్యత అని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ జె.సంధ్య అన్నారు. ప్లాస్టిక్ వినియోగంపై 'సాక్షి'లో 'అటకెక్కిన పాలిథిన్ నిషేధం' పేరుతో ఈనెల 10న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ప్లాస్టిక్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతలపై మండలంలోని మల్లవరం, బ్రాహ్మణగూడెం, చాగల్లు గ్రామాల్లో ఆరోగ్యశాఖ, పంచాయతీ సిబ్బంది బుధవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోడూరి కాశీ, పంచాయతీ కార్యదర్శి కమలావతి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ బస్సు సర్వీసులు పునరుద్ధరించండి

- మంత్రి కందుల దుర్గేష్ సూచన
- విశాఖకు కొత్తగా ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసు ప్రారంభం



విశాఖ ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసును ప్రారంభిస్తున్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు: మారుమూల ప్రాంత ప్రయాణికులకు అన్నివేళలా రవాణా సౌకర్యం కల్పించేలా ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. ఆర్టీసీ నిడదవోలు డిపో నుంచి పంగిడి, రాజమహేంద్రవరం మీదుగా విశాఖపట్నం వెళ్లే కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసును మంత్రి దుర్గేష్ బుధవారం నిడదవోలు ఆర్టీసీ డిపో ఆవరణలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్ వెళ్లే బస్సు సర్వీసులను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు నిర్ణయం తీసుకొని ఆ దిశగా నడుపుతున్నారన్నారు. ఆర్టీసీ అధికారులు పీపుల్స్ ఫ్రెండ్స్ అనే విధానాన్ని పాటించాలన్నారు. ఈ డిపో నుంచి ఎక్కువ రూట్లలో బస్సు సర్వీసులు నడిపి ప్రయాణికులకు మరింత సౌకర్యాన్ని కల్పించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు.

పర్యాటక రంగాభివృద్ధికి చర్యలు

టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం పర్యాటక రంగాలు ఇటీవల బాగా అభివృద్ధి చెందాయని మంత్రి దుర్గేష్ అన్నారు. నిడదవోలును కేంద్రంగా ఈ పరిసరాల్లోని అన్ని దేవాలయాలకు, ఇతర పర్యాటక స్థలాలకు తీసుకువెళ్లేలా ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఇలాంటి పర్యాటక ప్రాంతాలకు నిడదవోలు డిపో ద్వారా బస్ సర్వీసులను అందించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు సూచించామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణా అధికారి షర్మిల అశోక్, నిడదవోలు డిపో మేనేజర్ కె.శ్రీరామ్‌కుమార్, జనసేన, టీడీపీ పట్టణ శాఖల అధ్యక్షులు రంగా రమేష్ , కొమ్మన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు కార్మికుల ఆందోళన



నిడదవోలు తహసీల్దార్ ఆఫీసు వద్ద ఆందోళన చేస్తున్న వివిధ రంగాల కార్మికులు

నిడదవోలు: ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కార్మికులు బుధవారం కదం తొక్కారు. దేశవ్యాప్తంగా తలపెట్టిన డిమాండ్స్ డే లో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. గ్యాస్, రైస్‌మిల్ కార్మికులు, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్త్ మిషన్, మధ్యాహ్నం భోజన తయారీ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా గత ఐదేళ్లుగా నిర్వహించిన కార్మిక, కర్షక ఉద్యమాలతో కేంద్రంలో బీజేపీకి బలం తగ్గిపోయిందన్నారు. అయినప్పటికీ బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక వంటి తమ పాత విధానాలతో ముందుకు వెళ్లాలని చూస్తోందని విమర్శించారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు మేరీ విక్టోరియా మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు చెయ్యాలని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష, వెలుగు, మెప్మా, ఉపాధి హామీ, నేకో అయుష్, సేంద్రియ వ్యవసాయం, 108, 104 వాహనాల వంటి రంగాల్లో పని చేస్తున్నవారిని ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ నాగభూషణంకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఆందోళనలో దిద్దే దయామణి, గంటి కృష్ణ, ఎ.డేనియల్, యు.ధనలక్ష్మి, జి.మాధవి, ఈ.హైమావతి, ఓ.నాగలక్ష్మి, హేమలత, జ్యోతి, రత్నకుమారి, పార్వతి, ఎ.మమత, జరీనాబేగం, బోడమ్మ, సరళ, చిట్టూ బీబీ, యర్రా శ్రీను పాల్గొన్నారు.

కొవ్వూరులో..

కొవ్వూరు: లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్మికులు బుధవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. జూలై పదో తేదీ డిమాండ్స్ డే నిర్వహించామని నాయకులు ప్రకటించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దూకూరి దొరయ్య, మానికిరెడ్డి హరిబాబు, నందం కొండబాబు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు సమస్యలపై ఎంపీకి నేతల వినతి

కొవ్వూరు: కరోనా సమయంలో రద్దు చేసిన కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో ఆగే 36 రైళ్ల హాల్టులను పునరుద్ధరించాలంటూ బీజేపీ నాయకులు రాజమహేంద్రవరం ఎంపీ, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని కోరారు. పురందేశ్వరి బుధవారం గోపాలపురం నియోజకవర్గానికి వెళుతూ మార్గమధ్యంలో కొవ్వూరులో కొద్దిసేపు ఆగి తమ పార్టీ నాయకులతో ముచ్చటించారు. కొవ్వూరులోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిని ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా బీజేపీ నేతలు ఆమెను కోరారు. వివిధ ప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులు కొవ్వూరు ఆర్టీసీ డిపోకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పరిమి రాధాకృష్ణ, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, నియోజకవర్గ కో–కన్వీనర్ బీవీ ముత్యాలరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి మురళీకృష్ణ తదితరులు ఎంపీ పురంధేశ్వరిని కలిశారు.

పిట్టల వేమవరంలో పశుగ్రాస వారోత్సవాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధక శాఖ ఏడీ రుషి ప్రసాద్

పెరవలి: మండలంలోని పిట్టల వేమవరం గ్రామంలో బుధవారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు వి.రుషి ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 7 నుంచి 14 వరకూ ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సల్మా, అసిస్టెంట్ రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

హామీల అమలుకు అంగన్‌వాడీల డిమాండ్




నల్లజర్లలో తహసీల్దార్ కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

నల్లజర్ల: ప్రభుత్వం తమకిచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం నల్లజర్లలో తహసీల్దార్ కృష్ణారావు, ఎంపీడీఓ నరేష్‌కుమార్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తల మండల శాఖ అధ్యక్షురాలు శివకుమారి మాట్లాడుతూ 42 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ అధికారులకు వినతి పత్రాలు అందజేసినట్టు చెప్పారు. నెలవారీ వేతనంగా రూ.21 వేలు చెల్లించాలని, ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలని, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లుగా పదోన్నతి కల్పించాలని కోరారు. అలాగే రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు చెల్లించాలని, ఆరు యాప్‌లను రద్దు చేసి ఒకే యాప్‌గా చేసి కొత్త ఫోన్లు అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మృతి చెందిన కార్యకర్తలకు ఖనన ఖర్చులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తల ప్రాజెక్ట్ సంఘ అధ్యక్షురాలు విమలాభాయ్, రాజేశ్వరి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురంలో..

గోపాలపురం: తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలంటూ మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గోపాలపురం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కె.ప్రదీప్‌కుమార్‌కు వారు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం స్పందించి త్వరతగతిన పరిష్కరించాలని వినతి పత్రంలో కోరారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యదర్శి ఎన్. రామలక్ష్మి, భవానీ, సుశీల మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే



అంగన్‌వాడీ చిన్నారుల గ్రాడ్యుయేషన్ డేలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించడంతో పాటు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. అంగన్ వాడీ ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే ను బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు చేతుల మీదుగా చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. గ్రాడ్యుయేషన్ దుస్తుల్లో చిన్నారులు సందడి చేశారు. మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, మాజీ మునిసిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, సీడీపీవో డి.మమ్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఖరీఫ్ సాగు పనులు

పెరవలి: మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఖరీఫ్ సాగు పనులను ముమ్మరం చేశారు. ఇప్పటికే బోర్ల సాయంతో ఆకు మడులను సిద్ధం చేసిన అన్నదాతలు దమ్ములు చేపట్ట, నాట్లు వేసే ప్రయత్నాల్లో ఉన్నారు. మండలంలో ఖరీఫ్ వరిసాగు విస్తీర్ణం 8,500 ఎకరాలు. ఇందులో ఇప్పటికే 40 శాతం విస్తీర్ణంలో వరి నాట్లు పూర్తయ్యాయని మండల వ్యవసాయాధికారి మేరీ కిరణ్ తెలిపారు.